# వల్లభాచార్యులు



శ్రీనివాస బాలభారతి - 47

# వల్లభాచార్యులు

రచన

**డా॥ భీమసేన్ నిర్మల్**

ప్రధానసంపాదకుడు

**డా॥ ఎస్.బి. రఘునాథాచార్య**


ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2004**

ŚRĪNIVĀSA BĀLABHĀRATI - 47
(Children Series)

# VALLABHĀCHĀRYULU

By

**Dr. Bhimasen 'Nirmal'**

Chief-Editor:
Dr. S.B. Raghunathacharya

T.T.D. Religious Publications Series No.: 669

First Edition : 1989
Re-prints : 1999, 2004

Copies: 10,000

*Published by*
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Art : P. NARAYANAGIRI DATTU

*Printed at*
Sri Venugopala Offset Printers
VIJAYAWADA, PH : 5511302.

# ముందుమాట

అల్లారు ముద్దుగా పెరిగే అందాల బాలల అద్దాల్లాంటి మనసులు ఎంతో నిర్మలమైనవి. వాటిముందు మన మేలాంటి సంస్కారాలను నిలిపితే అవే ప్రతిబింబిస్తాయి. చెరగని ముద్ర వేసిన ఆ సంస్కారాలను వాళ్ళు భద్రంగా జీవితమంతా దాచుకుంటారు. భావిభారత పౌరులైన వారెంత సంస్కారంతో పెరిగితే, ఈ దేశాన్ని అంత చక్కగా తీర్చిదిద్ద గలుగుతారు. కనుక మన సంస్కృతిలోని గొప్పదనాన్ని, భారతజాతికి పెట్టని అలంకారాలై ప్రపంచాన్ని అలరించే మంచి గుణాలను వాళ్ళకు ఉగ్గుపాలతో నూరిపోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్ని విద్యలు నేర్చినా, ఎన్నెన్ని రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైనా ప్రజల్లో ఈ సంస్కారం కొఱవడితే ప్రమాణాలు పడిపోయి జాతి అంధకార బంధురమౌతుంది. అందుకే మనదేశంలో పుట్టి, ఏదో ఒక ఆదర్శానికి అంకితమై మనకు గర్వకారణమైన మహాపురుషులు మహాపతివ్రతల కథలు చిన్నారి పాపలకు అందుబాటులో ఉండేటట్లు చేయడానికే ఈ ప్రయత్నం. ప్రాచీన భారతీయుల మహత్తరాదర్శాలను పరోక్షంగా తెలియజేయడమే ఇందులోని ముఖ్యోద్దేశ్యం.

తిరుమల తిరుపతి దేవస్థానం ఈ సంకల్పంతోనే ''శ్రీనివాస బాలభారతి'' అనే పుస్తకమాలను చిన్న పిల్లలకోసం ప్రకటిస్తున్నది. 'మీరు బాలభారతి అన్నా మాకు, మా కుటుంబంలో అందరికి ఉపయోగిస్తున్న'దంటున్నారు చాలామంది పెద్దలు. తాము చదివి తమ పిల్లలచేత చదివిస్తే కొంతకు కొంత మా ఆశయం నెరవేరుతుంది.

ఈ బాల సాహిత్యాన్ని చక్కగా తీర్చిదిద్ది, వంచి రచనలను తయారు చేయించి, అందరికీ అందుబాటులో ఉండేటట్లు సంపాదించిన డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్యగారికి మా అభినందనలు. ఈ ప్రణాళికలో మాతో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

ఈ పుస్తక ముద్రణ ప్రతులు చెల్లిపోయినందున, చదువరులకు లభ్యమయ్యేందుకు ఇప్పుడు మరల ముద్రింప బడింది. ఈ పునర్ముద్రణ ఆసక్తిగల బాలలతోపాటు అందరినీ అలరిస్తుందని మా ఆకాంక్ష.

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# స్వాగతం!!

శ్రీనివాసదయోద్భూతా బాలానాం స్ఫూర్తిదాయినీ।
భారతీ జయతాల్లోకే భారతీయగుణోజ్జ్వలా॥

ఖండ ఖండాంతరాల్లో నాగరికత కన్నువిప్పేనాటికే సభ్యతకు సంస్కారానికి, నైతిక-ధార్మికాదర్శాలకు పేరు పడ్డది మన భరతఖండం. ఈ గడ్డపై పుట్టిన ప్రతిమానవుడు అధర్మాన్ని ఎదిరిస్తూ, ధర్మాచరణంలో తన జీవితాన్ని పండించుకొని, మాధవాని ముఖంగా నడచి మహనీయకీర్తి నార్జించినవారే. అలాంటి మహాత్ముల సన్నిధి మన మనసంతోషాలకు పెన్నిధి. కనీసం వారి జీవితాదర్శాలు మనస్సుల్లో మెదిలితే వారి ప్రభావం మనమీద ఎంతో ఉంటుంది. 'నేను భారతీయుణ్ణి' 'ఇది తరతరాలనుంచి వస్తున్న నా సంప్రదాయం' 'ఇది నాకర్తవ్యం' అని ప్రతిబాలుడు, బాలిక ఈ దేశ సేవకు తనను అంకితం చేసుకొంటారు.

నిజానికి ఈ దేశంలో ఎందరో మహానుభావులు మహాపురుషులు, మహాపతివ్రతలు, మహావీరులు పుట్టి, పెరిగి, చక్కని

సంస్కృతికి పునాదులు వేశారు. స్వచ్ఛమైన జీవనవాహిని మన దాకా ప్రవహింపచేశారు. అహా! మనమెంత అదృష్టవంతులం! మనవెనుక ఎంత ఉదాత్తమైన చరిత్ర ఉంది. ఆ పుణ్యపురుషులు మహాపాద్యులు ఇక్కడ పుట్టకపోతే మనదిగా మనం చెప్పుకొనే మహత్తరమైన ఈ సంస్కృతి, సభ్యత మనకెలా సంక్రమించేవి? వాళ్ళను అర్థంచేసుకోవడం, వాళ్ళ చరిత్ర మననంచేసుకోడం వారి ఆదర్శాలు స్మరించడంకూడ మనకు గొప్ప విజ్ఞానాన్నందించే విద్యాభ్యాసం. అది ముందు ముందు మనజాతి జీవనప్రవాహంలో కొన్ని ఏండ్లదాకా చెక్కుచెదరని స్ఫూర్తిసౌరభాలను విరజిమ్ముతుంది. అందుకే శ్రీనివాసబాలభారతి ఉదయించింది. ఎందరో మహానుభావుల్ని మీ ముందుంచుతోంది. ఇక మీదే ఆలస్యం.

బాలలూ! రండి! రండి!

నిండుమనస్సుతో మీ కిదే మా స్వాగతం!

క్రోధన
21-12-1985

ఎస్. బి. రఘునాథాచార్య
ప్రధానసంపాదకుడు

కన్ను పొడుచుకున్నా కనపడని కారుచీకటి. దూరాన ఏదో దివ్యకాంతి. అదిదో జమ్మిచెట్టులాగా ఉంది. దగ్గఱకు వెడితే కన్నురెప్పలైనా కదిలించలేని పసిగుడ్డు. చుట్టూ అగ్నివలయం. ఏమిటీ వింత! ఆహా! ఏ తల్లి కన్నబిడ్డో కదా! లేదు లేదు: ఎవరో మహాతల్లి ఆ బిడ్డను చేతుల్లోకి తీసుకుంటోంది. ఆప్రక్కన నిలబడి ఉన్నది. ఆమె భర్త కాబోలు. అబ్బ! ఈ పసికందు ఎంత ముద్దొస్తున్నాడో! ఎవరో కారణజన్ముడే అయి ఉంటాడు. భగవాన్ శ్రీకృష్ణుడు కాడుగదా! కాకేమి?

కాకర్ల లక్ష్మణభట్టుకు శ్రీమతి ఎల్లమ్మకు పుట్టిన పుత్రరత్నం. వైశ్వానరాగ్ని సంభూతుడు, శ్రీకృష్ణాంశ సంభవుడు, సుప్రసిద్ధనామధేయుడు, వల్లభాచార్యులు.

తెలుగుతల్లికి పుట్టి, భాగవత సప్తాహంలను నిర్వహిస్తూ భారతదేశమంతా ఎన్నోసార్లు పాదయాత్రచేసిన సాటిలేని మేటి భక్తశిరోమణి వల్లభాచార్యులు. శ్రీకృష్ణ

దేవరాయలు కనకాభిషేకం చేసి ఏడువేల బంగారు నాణాలు కానుక ఇవ్వగా ఏడింటిని మాత్రం తీసుకొని మిగతా నాణాలను పండితులందరికీ పంచిపెట్టిన పరమో దార స్వభావుడా మహనీయుడు. మధురకు వచ్చే మార్గంలో హిందువుల శిఖలను గడ్డాలుగా మార్చే యంత్రాన్ని రుస్తుం అలీ అమర్చినప్పుడు, మహమ్మ దీయులకు గడ్డాలుపోయి నెత్తిన శిఖలు ఏర్పడేటట్లు చేసే యంత్రాన్ని ఢిల్లీమార్గంలో అమర్చిన ఆయన ఆత్మస్థైర్యం, ధర్మదీక్ష ఎంతో అభినందించదగినవి; అనుసరింపదగినవి.

భగవదనుగ్రహాన్ని పరమార్థంగా అభివర్ణించే పుష్టిమార్గానికి స్రష్ట అయిన ఆ ఆచార్యవర్యుని సేవా భావం, త్యాగనిరతి, ఈనాడు మనకందరికీ ఆదర్శం కావాలి. ఇకచదవండి.

— ప్రధాన సంపాదకుడు

# వల్లభాచార్యులు

అకల్ప కల్పద్రుమ మల్పకల్పనా
వికల్ప జల్పప్రతికల్ప కౌతుకమ్ ।
అనల్ప కల్ప క్లమ సంప్లవప్లవం
మహాప్రభూణాం చరణాంబుజం వృణే ॥

**కారణజన్ముడు మహాప్రభువు :**

'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో సెలవిచ్చి ఉన్నారు. ప్రపంచంలో అధర్మం, కుతర్కం, సందేహం, మూర్ఖత్వం బాగా వ్యాపించి పోయినపుడు ఆ పరమాత్ముడు అవతరించాడు, తప్పకుండా అవతరిస్తాడు కూడా. తన ప్రబోధం, ఉపదేశం, కార్యాచరణ ద్వారా ప్రజల హృదయాలను నిర్మలంచేసి, వారిని సన్మార్గగాములను చేస్తాడు. ఈ భగవద్విభూతి ప్రతియుగంలోను అవతరిస్తూనే ఉంటుంది. వ్యాసుడు, గౌతమబుద్ధుడు, శంకరాచార్యుడు, రామానుజాచార్యుడు, మధ్వాచార్యుడు మొదలుగాగల మహామహులు అలాంటి

కారణజన్ముకే. ఆకోవకు చెందినవారే మహాప్రభువు వల్లభాచార్యులు. శుద్ధాద్వైతపుష్టి మార్గానికి చెందిన వైష్ణవులు శ్రీమద్వల్లభాచార్యులను మాత్రమే 'మహాప్రభువు' అనడం పరిపాటి.

**కాకరవాడలో కంభంపాటివారు:**

భగవత్ప్రాప్తికి అత్యంతం సులభమయిన పుష్టిమార్గాన్ని, శుద్ధాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శ్రీవల్లభాచార్యులు ఆంధ్రులు. వీరు కంభంపాటి వంశానికి చెందిన వెలనాటి బ్రాహ్మణులు. భారద్వాజస గోత్రజులు. కృష్ణయజుశ్శాఖాధ్యాయులు, ఆపస్తంబసూత్రజులు.

రేణుకాదేవి వీరి ఇలవేల్పు. ఈ కంభంపాటివారు కాకరవాడ గ్రామ వాస్తవ్యులు. ఈ గ్రామం కృష్ణానదికి దక్షిణతీరాన ఉన్న వ్యోమస్తంభగిరి (నేటి మంగళగిరి)కి దగ్గరలో ఉండేదట. 'కాకర'శబ్దానికి కొంతమంది పండితులు ఈ క్రింది విధంగా అర్థం చెప్పారు.

శ్లో॥ కం సుఖం కథ్యతే విజ్ఞైరాకరః ఖనిరుచ్యతే ।
సుఖానా మాకరత్వాత్ సా 'కాకరే' త్యభిధీయతే ॥

'క' అంటే సుఖమని, 'అకర' అంటే విధానమని అర్థం. 'కాకర' అంటే సుఖవిధానమని అర్థం. అటువంటి కాకరవాడలో వల్లభాచార్యుల పూర్వీకులు నివసించేవారు.

కాల్రకమాన ఆ ఊరు పాడువడి పోవడంతో, కంభంపాటి వారు అక్కడకు సమీపంలో ఉన్న అగ్రహారమనే ఊరికి తరలి వెళ్ళారు.

## మీ వంశంలో పుడతాను !

వల్లభాచార్యుల పూర్వపురుషుడు యజ్ఞనారాయణ దీక్షితులు. ఆయన సదాచారసంపన్నుడు, నిత్యాగ్నిహోత్రి. తమిళ దేశంలో బాగా వ్యాప్తి పొందిన విష్ణుస్వామి సంప్రదాయానికి చెందిన ఒక వైష్ణవాచార్యుడు యజ్ఞనారాయణకు గోపాల మంత్రోపదేశం చేశాడు. 'యజ్ఞో వై విష్ణుః' అనే శ్రుతి శ్రీమహావిష్ణువు యజ్ఞస్వరూపుడని చెబుతున్నది. కనుక ఆయనను ప్రసన్నుణ్ణి చేసుకోవడానికి, 100 సోమయాగాలు చేయాలని తలపెట్టాడు యజ్ఞనారాయణ దీక్షితులు. మొదటియాగం పూర్తిచేయగానే శ్రీకృష్ణభగవానుడు ఆయనకు కనిపించి, మీ వంశం వారు 100 సోమయాగాలు పూర్తిచేయగానే, నేను మీ వంశంలో అవతరించగలనని వరమిచ్చాడు. దీక్షితులు

31 సోమయాగాలు పూర్తి చేశారు. ఆయన కుమారుడు గంగాధర దీక్షితులు 27 సోమయాగాలు చేశారు. గంగాధరుడు గొప్పపండితుడు. ఆయన 'మీమాంసా రహస్యమ'నే గ్రంథాన్ని రచించారు. గంగాధరుని పుత్రుడు గణపతిభట్టు. ఆయన 32 యాగాలు చేశారు. 'తంత్రవిగ్రహమ'నే గ్రంథం రచించారు. గణపతిభట్టు కుమారుడు వల్లభభట్టు. ఆయన 5 సోమయాగాలు చేశారు. వల్లభభట్టుకు ఇద్దరు కుమారులు కలిగారు. పెద్దవాని పేరు లక్ష్మణభట్టు, రెండవ వాని పేరు జనార్ధనభట్టు. లక్ష్మణభట్టు 5 సోమయాగాలు చేశారు.

ఈ విధంగా కంభంపాటి వంశంవారు 100 సోమయాగాలు పరిపూర్తి చేశారు. లక్ష్మణభట్టు చివరియాగం పూర్తిచేసి, కాశీకి వెళ్ళి, అక్కడ లక్షఇరవై ఐదువేలమందికి సంతర్పణచేసి, తమ పూర్వీకుడయిన యజ్ఞనారాయణ దీక్షితుల సంకల్పాన్ని నెరవేర్చాను. ఇలాంటి పరమనైష్ఠికులూ, పండితులూ జన్మించిన వంశంలో వల్లభాచార్యులు జన్మించారు.

జమ్మిచెట్టుదగ్గఱకొచ్చి నన్ను తీసుకెళ్లండి :

లక్ష్మణభట్టు విజయనగర రాజవంశానికి వైష్ణవాచార్యుడయిన సుశర్మకుమార్తెలను వివాహమాడారు. పెద్దభార్యకు

ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలగగానే, ఆయనకు సన్న్యసించాలనే ఉద్దేశ్యం కలిగింది. అప్పుడు ఒక మహాపురుషుడు ఆయన దగ్గరికి వచ్చి 'నాయనా! మీ వంశంలో శ్రీకృష్ణభగవానుడు అవతరించబోతున్నాడు. కనుక నీవు సన్న్యాసం పుచ్చుకోవద్దు' అని హితబోధ చేశాడు. ఇంతలో రెండవ భార్య అయిన శ్రీమతి ఎల్లమ్మ గర్భం ధరించింది. ఆ సమయంలో కాశీని ధ్వంసం చేయడానికి మహమ్మదీయులు వచ్చి పడబోతున్నారని పుకారు పుట్టడంతో, కాశీలో ఉన్న దక్షిణదేశస్థులూ, ఇతరులూ తమ తమ గ్రామాలకు బయలుదేరారు. లక్ష్మణభట్టుకూడా తన భార్యాపుత్రులతో ఆంధ్రదేశానికి బయలుదేరాడు. వారు మధ్యప్రదేశ్‌లో నేటి రాయపూర్ అనే గ్రామానికి దగ్గరలో ఉన్న చంపారణ్యమనే ప్రాంతం చేరుకున్నారు. అప్పటికి మార్గాయాసం మూలకంగానూ, మానసికాందోళన కారణంగానూ ఎల్లమ్మగారికి ఎనిమిదవనెలలో ఒకానొక రాత్రిపూట గర్భస్రావం అయింది. చిమ్మచీకటి. పుట్టిన శిశువుకు ప్రాణం లేదనుకొని, తన చీర చెరగు చింపి, అందులో ఆ పిండాన్ని చుట్టి, అక్కడే ఉన్న ఒక జమ్మిచెట్టు తొర్రలో ఉంచింది ఆ ఇల్లాలు. అక్కడికి దగ్గరలో ఉన్న గ్రామంలో ఆ రాత్రి గడపాలని నిశ్చయించుకొని, వారు 'చౌడ' అనే గ్రామా

నికి వెళ్ళారు. తెల్లవారు ఝామున లక్ష్మణభట్టుకు, ఎల్లమ్మగారికి ఒకే విధమయిన కలవచ్చింది. వారికి శ్రీకృష్ణుడు కనిపించి 'నేను నా మాట ప్రకారం మీ వంశంలో జన్మించాను. మీరు ఆ జమ్మిచెట్టు వద్దకు వచ్చి నన్ను తెచ్చుకోవాల్సింది' అని ఆదేశించాడు. ఆ స్వప్నానికి వారు ఎంతగానో ఆశ్చర్యపడి పోయారు. తమ భాగ్యానికి ఎంతగానో మురిసిపోయారు. ఉరుకులు పరుగులమీద ఆ జమ్మిచెట్టు దగ్గరికి వెళ్ళారు. ఆశ్చర్యం, చెట్టుకింద, ఒక అగ్నివలయం మధ్య, ఎల్లమ్మ చీరె చెరగుమీద, కదలాడుతూ, భువన మోహనాకారుడయిన శిశువు కనిపించాడు. ఎల్లమ్మకు పాలు చేపుకువచ్చాయి. 'ఇతడే మనకు పుట్టిన శ్రీకృష్ణుడయితే, ఈ అగ్ని మనకు ఎలాంటి హాని కలిగించదు' అనుకుంటూ, ఎల్లమ్మ ఆ అద్భుత శిశువును ఒడిలోనికి తీసుకున్నది. అగ్నిదేవుడా దంపతులకు ఎలాంటి తాపమూ కలిగించలేదు. ఆ సమయంలో ఆకాశంనుంచి పూలవానకురిసింది. దేవదుందుభులు మోగాయి. నలువైపులా ప్రశాంతవాతావరణం వెల్లివిరిసింది. ఇలా విక్రమశకం 1535 (క్రీ.శ. 1478) వైశాఖ మాసం కృష్ణపక్ష ఏకాదశి, ఆదివారం రాత్రి దాదాపు 8-30 గంటలకు శ్రీకృష్ణముఖాంతర్గతుడయిన వైశ్వానరుడు లక్ష్మణభట్టుకు పుత్రుడుగా ఉదయించాడు. (వల్లభాచార్యులకు వైశ్వానరుడని నామాంతరంకూడా ఉంది)

లక్ష్మణభట్టు తన తండ్రి పేరే ఆ శిశువుకు పెట్టుకున్నాడు. తల్లి తండ్రులకు, చుట్టపక్కాలకు అల్లారు ముద్దుగా పెరుగుతున్న ఆ బాలకుడు నిజంగా అందరికి 'వల్లభుడే' అయ్యాడు.

## బాలవల్లభుని పాండిత్య ప్రతిభలు :

పరిస్థితులు శాంతించినట్లు తోచడంతో లక్ష్మణభట్టు మళ్ళీ తిరిగి కాశీ చేరుకున్నాడు. కాశీలో వారు 'హనుమాన్ ఘాట్'లో నివసించేవారు. శ్రీ వల్లభుని బాల్యం పండితనిలయమైన కాశీలో గడిచింది. ఐదవ ఏట వల్లభునకు ఉపనయనం చేశారు. ఆ చిన్న వయస్సులోనే ఆయన తండ్రితోపాటు విద్వత్సభలకు వెళ్ళేవాడు. ఒక్కొక్కప్పుడు తనే స్వయంగా వెళుతుండేవాడు. అక్కడ తన అద్వితీయ ప్రతిభాపాండిత్యాలతో కొమ్ములు తిరిగిన పండితులనే ఆశ్చర్యచకితులను చేసేవాడు. ఆ వయస్సులో వల్లభుడు రచించిన 'పత్రావలంబనం' అనే గ్రంథం పండితుల మెప్పుపొందింది. మాధవేంద్రపురి అనే పండితుని దగ్గర వేద-వేదాంగాలు, శాస్త్ర పురాణాలు క్షుణ్ణంగా అభ్యసించాడు. వేదాలు, వ్యాసమూత్రాలు, భగవద్గీత, శ్రీమద్భాగవతం—ఈ నాలుగే ప్రమాణిక గ్రంథాలు అని ఆయన నిశ్చయించుకున్నారు. వల్లభుల విద్వత్తునూ, పాండితీ ప్రతిభనుచూసి, సాక్షాత్తు సరస్వతియే ఆ బాలకుడి రూపంలో వచ్చిందా

ఆది వంధితులు విస్తుపోయేవారు. అప్పటినుంచి ఆయనకు బాలసరస్వతి అనే బిరుదనామం ఏర్పడింది.

## లక్ష్మణభట్టు వేంకటేశ్వరునిలో లీనం:

తమ పదకొండవఏట ఆయన తమ తలితండ్రులతో స్వగ్రామమైన అగ్రహారానికి బయలుదేరారు. తమ పూర్వీకుల నివాసస్థానమైన అగ్రహారం చేరుకున్నారు. వల్లభులకంటే ముందే వారి కీర్తి అక్కడకు వ్యాపించడంతో ఆ గ్రామంవారు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. ఆయన పినతండ్రి జనార్ధనభట్టు ఆయనకు ఒక సాలిగ్రామం, భాగవతమహాపురాణం బహూకరించాడు. ఆనాటినుండి మకాంచేసిన ప్రతిచోట 'భాగవతసప్తాహం' జరిపించడమనే నియమం పెట్టుకున్నారు వల్లభులు. అగ్రహారంలో ఉండగా ఎల్లమ్మగారికి ఏడుకొండలవాడిని దర్శించుకొని, జన్మపావనం చేసుకోవాలనే కోరిక కలిగింది. వెంటనే వల్లభులు తలిదండ్రులతో వేంకటాద్రి వేంచేశారు. ఏడుకొండలు ఎక్కి, ఆనందనిలయంలో శ్రీ వేంకటేశ్వరుని దర్శనం చేసుకుంటుండగా, లక్ష్మణభట్టు శ్రీ వేంకటేశ్వరునిలో లీనమై పోయారు. ఆయన జన్మ చరితార్థమై పోయింది. తిరుమలలో ఈనాటికీ వరాహస్వామి గుడిలో వల్లభాచార్యులు కూర్చున్న స్థలాన్ని యాత్రికులు సందర్శిస్తుంటారు.


chaya

**శ్రీకృష్ణదేవరాయలు కనకాభిషేకం:**

తిరుమలలో కొంతకాలముండి, అక్కడ భాగవతసప్తాహం నిర్వహించారు. అక్కడనుంచి తుంగభద్రానది తీరంలో ఉన్న విజయనగరం చేరుకున్నారు. మేనమామల ఇంట్లో బస చేశారు.

విజయనగర సామ్రాజ్యాన్ని సాహిత్య-సమరాంగణ సార్వ భౌముడైన శ్రీకృష్ణదేవరాయలు పరిపాలిస్తున్న రోజులవి. ఆ సమ యంలో శ్రీకృష్ణదేవరాయలు ధర్మసభలు ఏర్పాటు చేశారు. వివిధ మతాలకు, వివిధ సంప్రదాయాలకు చెందిన ఆచార్యులు, మహాపండి తులు ఆ సభల్లో పాల్గొని, తమ తమ సంప్రదాయాల ప్రాశస్త్యాన్ని, వైశిష్ట్యాన్ని ఉగ్గడించి, ఇతర సంప్రదాయాలను ఖండిస్తూ ఉండే వారు. ఆ శాస్త్రార్థంలో నేనూ పాల్గొంటానని వల్లభులు కబురు పెట్టారు. శ్రీకృష్ణదేవరాయలు వారిని సగౌరవంగా ఆహ్వానించారు. వల్లభులు సభలో తమ ప్రతిభతో, వాగ్ధాటితో ఇతరుల వాదాల న్నింటిని ఖండించి, తమ శుద్ధాద్వైతపుష్టిమార్గాన్ని ఏకైక సిద్ధాంతంగా ప్రతిపాదించారు. ఆ వాద ప్రతివాదాలు 28 రోజులపాటు జరిగాయి. ఆ బాలకుడి ప్రతిభకు, పాండిత్యానికి, వాదపటిమకు అందరూ ఆశ్చర్యపోయారు... 

'శ్రీవేదవ్యాస విష్ణుస్వామి సంప్రదాయ సముద్ధారసంభూత శ్రీ పురుషోత్తమ వదనావతార సర్వామ్నాయ సంచార-వైష్ణవామ్నాయ ప్రాచుర్యప్రకార శ్రీబిల్వ మంగళార్చిత సామ్రాజ్యాసనాఖండ భూమండలాచార్యవర్య జగద్గురు మహాప్రభు శ్రీమదాచార్యః, అనీ, 'ఆచార్యచక్ర చూడామణి' అని బిరుదం ఇచ్చి కనకాభిషేకం చేశారు. శ్రీవల్లభాచార్యులవారు ఆ సొమ్మంతా అక్కడ సమావేశమయిన పండితులకు పంచిపెట్టమని ఆదేశించారు. పల్లకిలో ఊరేగిస్తామన్న రాజుగారి కోరికను తిరస్కరించి వారు కాలినడకనే తమ మేనమామగారింటికి వెళ్ళారు. తమ యాత్రలలో వారు ఎప్పుడూ, ఎలాంటి వాహనాన్ని ఉపయోగించలేదు. వారు చేసిన యాత్రలన్నీ కాలినడకనే.

శ్రీకృష్ణదేవరాయలు తనవారందరితోపాటు వల్లభాచార్యుల వారిదగ్గర దీక్షపొంది, పుష్టిమార్గ వైష్ణవసిద్ధాంతాన్ని స్వీకరించారు. ఆ సమయంలో అక్కడనే ఉన్న శ్రీవిష్ణుస్వామిమతాచార్యులు, శ్రీ బిల్వమంగళాచార్యులు ఇద్దరూ తమ సంప్రదాయానికి కూడా శ్రీవల్లభాచార్యులనే ఆచార్యపాదులుగా స్వీకరించారు.

**ఏడునాణేలు చాలు :**

శ్రీవల్లభాచార్యుల దగ్గర దీక్షపొందిన తరువాత శ్రీకృష్ణ దేవరాయలు వారికి గురుదక్షిణగా 7000 బంగారు నాణేలు సమర్పిం

దారు. వాటిలోనుంచి ఆచార్యులవారు కేవలం ఏడునాణేలు మాత్ర గ్రహించి, మిగతా వాటిని అక్కడ ఉన్నవారికి పంచిపెట్టారు. తరవాత ఆ ఏడు నాణేలు 'శ్రీనాథ్‌ద్వారా'లో వెలసిన గోవర్ధనుడికి బంగారు మొలత్రాడుగా చేయించారని కొందరంటారు. కొందరు ద్వాపరయుగంలో నందుడి ఆలమందకు చెందిన ఒక గోవును కొనడానికి వెచ్చించారని అంటారు. ఆ గోవు సంతతికి చెందిన గోవులు 'నాథ్‌ద్వారా'లో మనకు ఈనాటికి కనిపిస్తూనే ఉంటాయి.

ప్రచారయాత్రలు :

విజయనగరంనుంచి వల్లభాచార్యులవారు శ్రీకృష్ణభక్తిని, పుష్టిమార్గాన్ని ప్రచారం చేస్తూ భారతదేశయాత్ర చేశారు. మొట్ట మొదట శ్రీరామచంద్రమూర్తి పవిత్రం చేసిన పంపాసరోవర తీరంలో కొంతకాలం విశ్రమించారు. అక్కడ భాగవతసప్తాహం నిర్వహించి, ప్రవచనం చేశారు. కృష్ణదాసు అనే క్షత్రియుడికి దీక్షప్రసాదించారు. అక్కడనుంచి ఋష్యమూకం, కిష్కింధ మొదలైన పవిత్రస్థానాలను సందర్శిస్తూ, కంచి, చిదంబరం, రామేశ్వరం, శేశాద్రి, పద్మనాభం వెళ్ళారు. పద్మనాభంలో పట్టపురాణిని ప్రేతబాధనుంచి విముక్తురాలిని చేశారు.

వల్లభునికి వాక్పతి బిరుదు !

ఈ యాత్రలో ఒకచోట రవినాథ వైదికి అనే పండితుడు వల్లభాచార్యుల వేదవిజ్ఞానాన్ని పరీక్షిద్దామని వచ్చారు. ఆయన వేదంలోని మంత్రాలను ఒకటి విడిచి ఒకటిగా చదవసాగారు. వల్లభాచార్యులవారు చివరి మంత్రంనుండి మొదలుపెట్టి మొదటి మంత్రందాకా చదివి వినిపించారు. తరవాత వల్లభాచార్యులను కొన్ని ప్రశ్నలువేసి, వాటికి తృప్తికరమైన జవాబులుపొంది, ఆయనకు 'వాక్పతి' అనే బిరుదిచ్చారు రవినాథుడు.

పుష్పదంతాచార్యులు, ప్రతిబింబవాదానికి చెందిన మరి కొంతమంది ఆచార్యులు-పండితులూ వల్లభాచార్యుల వాదపటిమకు నిలవలేక, వారికి శిష్యులయిపోయారు.

అక్కడనుంచి ఉత్తరానికి బయలుదేరి, గోకర్ణం, ఉడిపి క్షేత్రాలు దర్శించి, గుజరాతులోని నర్మదానదికి ప్రదక్షిణంచేసి, సిద్ధపురం, కుండినపురం, వటేశ్వరం సందర్శించుకొని, రాజస్థానంలోని పుష్కరం చేరుకున్నారు. ఆ పైన ఉత్తరఖండంలోని గంగోత్రి, బదరీనాథ్, కేదారనాథ్ మొదలైన పుణ్యక్షేత్రాలు సేవించుకొని, తొమ్మిది సంవత్సరాల తర్వాత కాశీ చేరుకున్నారు.

నా దగ్గఱికివచ్చి సేవించు।

వల్లభాచార్యులవారు చంపారణ్యంలో అవిర్భవించిన సమయానికే బృందావనంలోని గోవర్ధనగిరిమీద ఒక అద్భుతం జరిగింది. గోవర్ధనగిరిలో అణగిపోయి ఉన్న శ్రీగోవర్ధనగిరిధారి అయిన శ్రీకృష్ణుని విగ్రహంయొక్క ముఖంమాత్రం బయటపడింది. ఆ విగ్రహముఖం అదేవిధంగా దాదాపు 15 సం॥ల పాటు భక్తుల పూజలందుకుంటూ వచ్చింది.

విక్రమశకం 1549 ఫాల్గుణ శుద్ధ ఏకాదశి గురువారంనాడు గోవర్ధనపర్వతంమీద వెలసిన శ్రీనాథుడు వల్లభాచార్యులవారికి కలలో కనిపించి, తనదగ్గరికి వచ్చి సేవలు చేయవలసిందని ఆదేశించారు. వెంటనే వారు బయలుదేరి మధురానగరం వెళ్ళి అక్కడ 'ఉజాగర్‌చౌబే' ఇంట్లో మకాంచేశారు. ఆ తరువాత గోవర్ధనగిరికి వెళ్ళి స్వామి ముఖ దర్శనం చేయబోగా, స్వామి విగ్రహం పూర్తిగా బయటికివచ్చి, వల్లభులను ఆలింగనం చేసుకున్నదట. వల్లభాచార్యులవారు స్వామి ఆజ్ఞానుసారంగా గోవర్ధనపర్వతం మీద చిన్నఆలయం కట్టించి, శ్రీనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి. నిత్య సేవాకైంకర్యాలు జరిపించడానికి తగిన ఏర్పాట్లు చేశారు, ఈ విధంగా వల్లభాచార్యులవారు సుప్రతిష్ఠితం చేసిన విగ్రహమే

నేడు రాజస్థాన్‌లోని ఉదయపూరుకు దగ్గర నాథ్‌ద్వారాలో పూజ లందుకుంటున్నది. వల్లభాచార్యుల వంశానికి చెందిన గోస్వాములే నేటికి అక్కడ ధర్మకర్తలుగా ఉన్నారు. నాథ్‌ద్వారా మనదేశంలో తిరుపతి తరవాత అతి సంపన్నమైన దేవస్థానం.

యంత్రానికి ప్రతియంత్రం:

మధురలో వల్లభాచార్యులవారు విడిదిచేసి ఉండగా ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. మదురకు వచ్చేత్రోవలో సికిందర్ లోడీ సేనాపతి రుస్తుం అలీ ఒక విచిత్రమైన యంత్రం కట్టించాడట. ఆ యంత్రం మూలకంగా ఆ త్రోవనపోయే హిందువుల శిఖలు గడ్డాలుగా మారిపోయేవట. కొంతమంది హిందువులు మహా ప్రభువైన వల్లభాచార్యులకు ఈ విషయం గురించి ఫిర్యాదుచేశారు. వెంటనే ఆయన తన శిష్యులను పిలిపించి, ఢిల్లీకిపోయే త్రోవలో ఇంకోయంత్రం ఏర్పాటు చేయించాడట. ఆ యంత్రం మహిమ కారణంగా ఆ త్రోవనపోయే మహమ్మదీయులకు గడ్డాలుపోయి, నెత్తిన పిలకలు ఏర్పడేవట. ఈ సంగతి తెలుసుకొని సికిందర్‌లోడీ రుస్తుం అలీని చీవాట్లు పెట్టి, ఆ యంత్రం తీయించి వేశాడు. వల్లభాచార్యుల శిష్యులుకూడ వారు స్థాపించిన యంత్రాన్ని తొలగించి వేశారు.

**బలరామ-కృష్ణుల వరం:**

శ్రీనాథుడికి-గోవర్ధనగిరిధారి అయిన శ్రీకృష్ణునికి ఆలయ నిర్మాణం చేయించిన తరవాత, వల్లభాచార్యులవారు గోవర్ధనగిరి చుట్టూ ఏడుకోసుల ప్రదక్షిణ, వ్రజమండలం (బృందావనం) చుట్టూ 84 కోసుల ప్రదక్షిణ చేశారు. ఆయన భక్తి నిష్ఠలకు ప్రసన్నులై బలరామ, శ్రీకృష్ణులు ఆయనకు కుమారులుగా జన్మిస్తామని వర మిచ్చారట. ఆ తరవాత వైష్ణవులందరికీ గోవర్ధనగిరి ప్రదక్షిణ, వ్రజమండలప్రదక్షిణ నియమైపోయింది.

కాలక్రమాన వల్లభాచార్యులవారికి గోపీనాథుడు, విఠల నాథుడు అనే ఇద్దరు కొడుకులు కలిగారు. వల్లభసంప్రదాయంవారు గోపీనాథ, విఠలనాథులను బలరామ, శ్రీకృష్ణుల అవతారాలుగా పరిగణిస్తారు.

**బ్రహ్మసంబంధమంత్రోపదేశం:**

గోకులంలో ఉన్నప్పుడు వల్లభాచార్యులవారు యమునానది తీరానగల గోవిందఘాట్‌లో మకాంచేశారు. ఒకనాడు శ్రావణ శుక్ల ఏకాదశినాడు వారిమనస్సు చింతాక్రాంతమయి పోయింది. ఇంట్లో కాలు నిలవలేదు. యమునానదీతీరంలో వెళ్ళి కూర్చున్నారు.

సమస్త దోషాలకు నెలవైన జీవుడికి, గుణనిధానమైన పురుషో త్తముడికి సంబంధం ఎలా పొసగుతుందని ఎంతగానో విచారించారు. వారికి అర్ధరాత్రివరకు కునుకుపట్టలేదు. అర్ధరాత్రి గడచింది. కోటికందర్పసుందరాకారుడైన శ్రీకృష్ణభగవానుడు వారిముందర సాక్షాత్కరించాడు. ఆత్మసమర్పణ పూర్వకమైన బ్రహ్మసంబంధ మంత్రాన్ని ఉపదేశించాడు. జీవోద్ధరణకై తల్లడిల్లిపోతున్న ఆచార్యులవారిని ఇలా ఆదేశించాడు. 'శరణాగతి పూర్వకమైన, ఆత్మసమర్పణ రూపమైన ఈ మంత్రాన్ని నీవు ఎవరికి ఉపదేశించినా సరే, ఆ క్షణమే జన్మజన్మాంతరాలలో వారుచేసిన పాపాలన్నీ నశించిపోయి, వారు పవిత్రులవుతారు. అప్పుడు వారికి నాతో సంబంధం కలిగి ఉండడానికి అర్హత ఏర్పడుతుంది. ఇలా నీచేత బ్రహ్మసంబంధ మంత్రోపదేశం పొందినవారు నాకు భక్తులై, నాకు సేవలు చేయడానికి అర్హులవుతారు. నా అనుగ్రహంచేత వారు నన్ను పొందగలుగుతారు,

పురుషోత్తముడైన శ్రీకృష్ణుని ఆదేశాన్ని మహానందంతో శిరసావహించి, వల్లభాచార్యులవారు అక్కడికక్కడే కుంకుమ పువ్వుతో కలిపిన పవిత్రం స్వామికి సమర్పించి, పటికబెల్లం నైవేద్యం పెట్టారు. ఆ మరునటి రోజున భగవదనుగ్రహమే

ప్రధానంగాశం పుష్టిమార్గసిద్ధాంతానుసారంగా, బ్రహ్మ సంబంధ దీక్ష ఇవ్వసాగారు. మొట్టమొదట తమ ప్రియతమ శిష్యులైన దామోదరదాసుకు బ్రహ్మసంబంధదీక్ష ఇచ్చారు. దామోదరదాసు తన గురువులైన వల్లభాచార్యులకు పవిత్రధారణం చేయించి, పటికబెల్లం నైవేద్యంగా సమర్పించారు. ఆ తరవాత వారు చిన్నా పెద్దలనే భేదభావం లేకుండా, దైవాంశంతో కూడిన జీవులకు బ్రహ్మ సంబంధ దీక్ష ఇవ్వసాగారు.

బ్రహ్మ సంబంధ దీక్ష కారణంగా శ్రావణమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశి, ద్వాదశులను వైష్ణవులు పరమపవిత్రమైన గురు పర్వంగా పరిగణిస్తారు.

మహామంత్రార్థం :

బ్రహ్మ సంబంధ దీక్షను తీసుకునే సమయంలో చేతిలో తులసీదళం ఉంచుకొని, తులసి సాక్షిగా, మహామంత్రాన్ని ఉచ్చరించాలి. ఆ మహామంత్ర భావార్థం ఇది:

'ఓ పరమాత్మా! నీ నుండి విడిపోయి ఎన్నో యుగాలుగా జనన-మరణ చక్రంలోపడి కొట్టుకుంటున్నాను. ఎన్నో జన్మ లెత్తి, ఎన్నో కష్టాలు అనుభవించాను. ప్రతి జన్మలోను తాపత్ర

యానికి గురవుతున్నాను. ఈ సాంసారిక వ్యామోహంవల్ల నిన్ను కలుసుకోవాలనే తీవ్రమైన కోరిక, దానివల్ల కలిగే ఆనందానుభూతి మరుగున పడిపోయింది. నేను ఇలాంటి పాపుణ్ణి, దుష్టుణ్ణి. నీవు షడ్గుణైశ్వర్య సంపన్నుడవు. అలౌకిక ధర్మ సంశోభితుడవు. వియోగ-సంయోగ రస స్వరూపుడివి. గోపీజన వల్లభుడవు. నాలో ఉన్న మమతాహంకారాలు, దేహేంద్రియ ప్రాణాంతఃకరణాలు, వాటి వాటి ధర్మాలు, పాపపుణ్యాలు-ఇవన్నీ, భగవంతుడవైన నీ చరణ కమలాలముందు సమర్పిస్తున్నాను. నా ఆత్మనే నీకు సమర్పిస్తున్నాను. నేను నీ దాసుణ్ణి. హే ప్రభో! హే శ్రీకృష్ణా! నేను నీ వాడను. సమస్తం వదలిపేసి నీ చరణాల శరణు కోరుకుంటున్నా. నన్ను స్వీకరించు.

ఈ బ్రహ్మ సంబంధమంత్రం ఆత్మదీక్ష కావడంచేత వైదిక దీక్షలన్నింటి కంటే గొప్పది. ఈ దీక్ష స్వీకరించిన జీవుడికి ఏలాంటి దోషమూ ఉండదు.

ఈ మహామంత్రానికి ముందు-చివర అష్టాక్షరమంత్రం పఠించాలి. 'శ్రీకృష్ణః శరణం మమ' అనేదే ఆ అష్టాక్షరమంత్రం అష్టాక్షర మంత్రానికి ప్రతిపదార్థం ఇలా చెప్పబడినది.

శ్రీ — సౌభాగ్యలక్ష్మీప్రదమయింది. రాజపూజ్యత్వం కలిగిస్తుంది.

కృ — పాపాలను నాశనం చేస్తుంది.

ష్ణః — త్రివిధాలైన దుఃఖాలను పోగొడుతుంది.

శ — జన్మమరణ దుఃఖాలను తొలగిస్తుంది.

ర — పరమాత్మ సంబంధమైన తత్వజ్ఞానం కలిగిస్తుంది.

ణం — శ్రీకృష్ణునిపట్ల దృఢమయిన భక్తిని కలిగిస్తుంది.

మ — పరమాత్మని సేవకు అర్హత కలిగించిన గురువుపట్ల ప్రేమానురాగాలను కలిగిస్తుంది.

మ — ప్రభువుతో సాయుజ్యం కలిగించి, పునర్జన్మ లేకుండా చేస్తుంది.

పూరీ సర్వమత మహాసభ:

ఆ తరవాత వల్లభాచార్యుల వారు రెండోసారి దేశయాత్రకు బయలుదేరారు. మజిలీ చేసిన ప్రతిచోట భాగవతసప్తాహం జరిపించి, ప్రవచనం చేసేవారు. భక్తులకు బ్రహ్మసంబంధ దీక్ష ప్రసాదించి, అష్టాక్షరీ మంత్రోపదేశం చేసేవారు. ఈ యాత్రలో

వారు పూరి జగన్నాథంలో సర్వమతసభలో, ఇతరుల సిద్ధాంతా లన్నింటిని ఖండించి, శ్రీకృష్ణమాహాత్మ్యాన్ని నిర్ద్వంద్వంగా ప్రతిపాదించారు.


ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం
ఏకో దేవో దేవకీపుత్ర ఏవ ।
మంత్రోప్యేక స్తస్య నామాని యాని
కర్మాప్యేకం తస్యదేవస్య సేవా ॥

(గీత ఒక్కటే పరమశాస్త్రం. దేవకీపుత్రుడే పరమ తత్త్వం. శ్రీకృష్ణ నామమే పరమమంత్రం. ఆయన సేవయే శ్రేష్ఠమయిన కర్మ.) అని ప్రతిపాదించారు. ఈ శ్లోకాన్ని శ్రీజగన్నాథుడే ఒక అకుపై వ్రాసి, సభ్యులముందు పడవేసి, వల్లభా చార్యులు ప్రతిపాదించిన సిద్ధాంతానికి తమ ఆమోదం తెలిపారట.

విఠలదేవుని ఆదేశం:

ఇలా వల్లభాచార్యులవారు కాలినడకన దేశమంతా సంచారం చేసి, శుద్ధాద్వైతసిద్ధాంతాన్ని, పుష్టిమార్గ భక్తివిధానాన్ని బాగా ప్రచారం చేశారు. వారి వెంబడి వారి ప్రధాన శిష్యులయిన దామోదరదాసు, కృష్ణదాసు, వాసుదేవదాసు మొదలయినవారు మాత్రమే ఉండేవారు.





రెండోసారి యాత్రాకార్యక్రమంలో పండరిపురంలో చంద్రభాగా నదీతీరంలో ఉండగా, విఠలదేవుడు వారిని గృహస్థాశ్రమం స్వీకరించ వలసిందని ఆదేశించాడు. యాత్ర ముగించుకొని కాశీ చేరుకున్న తరవాత దేవభట్టుగారి పుత్రిక శ్రీమతి మహాలక్ష్మిని వల్లభాచార్యులు వివాహం చేసుకున్నారు.

మూడో తీర్థయాత్ర :

వివాహానంతరం వల్లభాచార్యుల వారు పత్నీసమేతంగా మూడోసారి దేశయాత్రకు బయలుదేరారు. రోజుకు పన్నెండు మైళ్ళకు తక్కువ కాకుండా నడిచేవారు. మధ్య మధ్యలో విడిది చేసినచోట భాగవతసప్తాహాలు నిర్వహించి, ప్రవచనం చేసేవారు. భక్తులకు బ్రహ్మసంబంధ దీక్ష ప్రసాదించి, అష్టాక్షరీ మంత్రోపదేశం చేసేవారు. శాస్త్రచర్చల్లో పాల్గొంటూ, భగవత్సేవలో సమయం గడుపుతూ ఉండేవారు.

ప్రభుజీ కీ బైఠక్ :

ఇలా మూడోసారికూడా యాత్ర ముగించుకొని వచ్చిన తరవాత వల్లభాచార్యులవారు దాదాపు 22 సం॥కాలం 'అడేల్' (అలకాపురం) 'చరణాట్' 'బృందావనం' అనే గ్రామాల్లో గడి

పారు. ఈ మూటిలోకూడా 'అడేల్' అనే గ్రామంలో ఎక్కువ కాలం గడిపారు. ఇది యమునా నదికి దక్షిణ తీరంలో, ప్రయాగలో త్రివేణీ సంగమానికి దగ్గరగా ఉన్నది. ఇప్పటికీ అక్కడ పుష్టిమార్గ సంప్రదాయం వారి మఠం ఉన్నది.

తమ దేశ పర్యటన సందర్భంలో వారు 84 ప్రదేశాలలో భాగవతసప్తాహాలు జరిపారు. అంటే ఆయా ప్రదేశాలలో వారం రోజులకు పైగా ఉన్నారన్నమాట. ఆయా ప్రదేశాలను 'ప్రభుజీ కి బైఠక్'(మహాప్రభువు మెట్టిన ప్రదేశాలు) అని అంటారు. మన తెలుగుదేశంలో మంగళగిరి, తిరుపతి పుణ్యక్షేత్రాలలో 'ప్రభుజీకి బైఠక్' అన్న పేరిట వల్లభసంప్రదాయానికి చెందిన మఠాలు ఉన్నాయి.

వల్లభాచార్యులవారు ఏకాంతస్థానంలో ఉండి గ్రంథరచన చేసేవారు. శాస్త్ర పురాణాల్లో ఉన్న గూఢార్థాలను వివరించడానికి, శ్రీకృష్ణభక్తిలో సౌలభ్యాన్ని, మాధుర్యాన్ని తెలియపరచడానికి వారు 84 గ్రంథాలు వ్రాశారు. వారి శిష్యులలో కూడా 84 మంది ప్రధాన వైష్ణవ భక్తులుగా గణుతికెక్కారు.

**పుష్టిమార్గమంటే :**

భగవత్ ప్రాప్తికి పుష్టిభక్తి అతి సులభమైన ఉపాయమనీ, సాధనమనీ ఉపదేశించారు. పుష్టి అంటే భగవదనుగ్రహం, 'పోషణం తదనుగ్రహః' అని శ్రీమద్భాగవతంలో చెప్పబడింది. పుష్టి ఆత్మకళ్యాణానికి సాధనం. పుష్టి అనబడే భగవదనుగ్రహమే పుష్టిమార్గభక్తికి గల ప్రధానతత్త్వం.

**పుష్టిజీవుల విశిష్టత :**

ప్రపంచంలో జీవులు మూడు రకాలు. వారు మర్యాదాజీవులు, ప్రవాహజీవులు, పుష్టిజీవులు. వేద, శాస్త్ర నియమానుసారంగా ప్రవర్తించేవారు మర్యాదాజీవులు. ఎలాంటి నియమ-నిబంధనలు లేకుండా, ఇష్టంవచ్చినట్లు జీవితం గడిపేవారు ప్రవాహజీవులు. భగవదనుగ్రహానికి పాత్రులై, శ్రీకృష్ణభక్తిలో జీవితం గడిపేవారు పుష్టిజీవులు. పుష్టిజీవులు ఇతరులకంటే శ్రేష్ఠులు. అష్టాక్షరమంత్రోపదేశం పొంది, నామస్మరణం చేయడం వల్లనూ, బ్రహ్మసంబంధ దీక్ష పొందడం వల్లనూ భగవదనుగ్రహం ప్రాప్తిస్తుంది. ఆత్మసమర్పణ, ప్రేమానురాగాలతో భగవంతుణ్ణి సేవించడంవల్ల, భగవదనుగ్రహం పొందడానికి వీలవుతుంది.

1567 (విక్రమశకం) ఆశ్వయుజ కృష్ణ ద్వాదశిరోజున 'అడేల్' గ్రామంలో వల్లభాచార్యుల వారికి ప్రథమ పుత్రుడు శ్రీ గోపీనాథుడు అవతరించాడు అటు తరవాత 1572 (విక్రమ శకం) పుష్యమాస కృష్ణ నవమి శుక్రవారం రోజున 'చరణాట్'లో శ్రీ విఠలనాథుడు ఉదయించారు. వల్లభసంప్రదాయంలో వీరిద్దరిని బలరామ శ్రీకృష్ణుల అవతారాలుగా పరిగణిస్తారని ముందే తెలుసుకున్నాం.

గోపీనాథుని కఠినదీక్ష!

గోపీనాథుడు శ్రీమద్భాగవత పురాణ పారాయణం పూర్తి చేయందే భోజనం చేసేవాడు కాదు. తరచుగా మూడు-నాలుగు రోజుల తరవాతగాని భోజనం చేయడానికి వీలుపడేదికాదు. అయినా నియమభంగం కలగనిచ్చేవాడుకాదు. ఇలా భోజనానికి అంతరాయం కలగడం చూసి, వల్లభాచార్యులవారు భాగవతసారసంగ్రహంగా 'శ్రీ పురుషోత్తమ సహస్రనామ' మనే గ్రంథం వ్రాసి, దానిని పారాయణం చేస్తే, భాగవత పారాయణ ఫలితం కలుగుతుందని సెలవిచ్చారట. అనాటినుంచి గోపీనాథుడు సహస్రనామ పారాయణం చేసి భోజనం చేసేవాడు.

**గోపీనాథుడు బలరామునిలో లీనం:**

వల్లభాచార్యులవారి తరవాత ఆచార్యపీఠం అధిష్ఠించిన గోపీనాథుడు గొప్ప మహిమ కలవాడు. ఆయన శ్రీగోవర్ధననాథుని నిత్యపూజాకైంకర్యాలను ఎంతో సమర్థంగా నిర్వహించాడు. ఆయన గుజరాతు, ఒరిస్సా, దక్షిణ భారతదేశమంతా పర్యటించి, పుష్టిమార్గ ప్రచారం చేశాడు. ఆయన తనజీవితంలో ఎక్కువ కాలం పూరి జగన్నాథంలో గడిపాడు. అక్కడ జగన్నాథుడి దేవాలయంలో పూజావిధానాన్ని పుష్టిమార్గపద్ధతులకు అనుగుణంగా తీర్చిదిద్దాడు. పూరి జగన్నాథంలో ఉంటూ, ఒకనాడు భక్తులందరూ చూస్తుండగా, బలరామదేవుని విగ్రహంలో లీనమైపోయాడు.

గోపీనాథునికి ఒక్కడే కుమారుడు కలిగాడు. అతని పేరు పురుషోత్తముడు. పురుషోత్తముడు చిన్నవయస్సులోనే సన్న్యసించడంతో ఆ వంశం అంతటితోనే ఆగిపోయింది.

**విఠలనాథుడు – భక్తిసాహిత్యవికాసం:**

గోపీనాథుని తరవాత వల్లభాచార్యుల కనిష్ఠ పుత్రుడైన విఠలనాథుడు ఆచార్యపీఠం అలంకరించాడు. విఠలనాథుని కాలంలో పుష్టిమార్గ భక్తి సంప్రదాయం మూడు పువ్వులు ఆరుకాయలుగా

విస్తరిల్లింది. విఠలనాథుడికి సంగీతం, చిత్రకళలో ప్రవేశముండ టంతో, పుష్టిమార్గానికి చెందిన భగవత్సేవాకార్యక్రమంలో సంగీతానికి, చిత్రకళకు ప్రత్యేకమైన స్థానం లభించింది. పుష్టిమార్గ సిద్ధాంతాలు కేవలం దార్శనిక-ధార్మిక రంగాలలోనే కాక సాహిత్య రంగంలో కూడా స్థానం సంపాదించుకున్నాయి. తమ తండ్రిగారి శిష్యులు నలుగురు, తమ శిష్యులు నలుగురు-మొత్తం ఎనిమిదిమంది కవులకు 'అష్టఛాప్' అని పేరు పెట్టి, వారి సంకీర్తనాసాహిత్యానికి చక్కటి రూపు ఏర్పరచారు. అష్టసఖులనబడే కవులలో సూరదాసు నందదాసు అనేవారు ప్రముఖులు. హిందీలో కృష్ణభక్తి సాహిత్యానికి శ్రీకారం చుట్టినవారు వల్లభాచార్యులయితే దానిని విస్తృతంగా వికసింప చేసినవాడు విఠలనాథుడు.

## అక్బర్ ద్వారా 'గోస్వామి' బిరుదు :

ఆనాడు ఉత్తర భారతదేశంలోని రాజులు, మహారాజులు విఠలనాథుని శిష్యులై, తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. అక్బరు చక్రవర్తి కూడా వీరిపట్ల భక్తి శ్రద్ధలు కలిగి ఉండేవారు. మధుర బృందావన పరిసరాలలో గోవధ జరగడానికి వీలులేదని అక్బరుచక్రవర్తి ఫర్మానా జారీ చేశారు. గోకులం, మహావనం,

జతీపూరా మొదలయిన గ్రామాలను విఠలనాథునికి వంశపారం-పర్యంగా దానం చేశాడు. అక్బరుపాదుషా జారీ చేసిన ఈ దాన శాసనాలు, దస్తావేజులు, ఫర్మానాలు ఈనాటికీ శ్రీనాథ్‌ద్వారాలో 'తికాయత్' గారి దగ్గర ఉన్నాయి. అక్బరుపాదుషా విఠలనాథుడికి 'గోస్వామి' అని బిరుదమిచ్చి సత్కరించాడు. తమ తండ్రిగారు ప్రారంభించిన ఎన్నో పనులను విఠలనాథుడు పూర్తి చేశాడు.

మీదర్శనంలాగానే:

ఒకసారి గోకులంలోని ఠకురాని ఘట్టంలో గోస్వామి విఠలనాథుడు సంధ్యావందనం చేసుకుంటుండగా, అక్బర్ బీర్బల్‌ను వెంటబెట్టుకొని అక్కడకు వచ్చారట. అక్బరు విఠలనాథుణ్ణి 'పరమాత్మ దర్శనం ఎలా సాధ్యపడుతుంద'ని అడిగాడు. 'మీరు వచ్చి నాకు దర్శనమిచ్చినట్లే'నని విఠలనాథుడు జవాబు చెప్పారు. తన జవాబును వివరిస్తూ ఆయన ఇలా అన్నారు- "నా అంతట నేను మీ దర్శనానికి వచ్చి ఉన్నట్లయితే, మీకు ఇష్టం ఉంటే, దర్బారుకో లేదా అంతఃపురానికో పిలిపించుకొనేవారు. లేకపోతే ప్రస్తుతం తీరుబడి లేదని దర్శనం ఇచ్చేవారు కాదు. కాని ఇప్పుడు తమంతట తామే వచ్చారు కనుక ఎటువంటి అభ్యంతరమూ

లేకపోయింది. అదేవిధంగా జీవుడు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా భగవత్సాన్నిధ్యం సాధ్యపడదు, కాని భగవంతుడే తలచుకుంటే, క్షణంలో జీవుణ్ణి ఉద్ధరించగలడు. కనుక జీవుడు తన ఆచరణ, భగవత్సేవ మొదలయినవాటివల్ల భగవదనుగ్రహాన్ని పొందడానికి ప్రయత్నించాలి.' విఠలనాథుడి వివరణం పుష్టిమార్గభక్తికి అనురూపంగా ఉంది. ఆ వివరణ విని అక్బరు ప్రసన్నుడై, విఠలనాథునికి నమస్కరించి వెళ్ళిపోయాడట.

అష్టఛాప్‌లో సూరదాసు :

గోస్వామి విఠలనాథుల శిష్యంలో 252 మంది ప్రముఖులు. వీరిలో హిందువులేకాక మహమ్మదీయులు, పఠానులు, హరిజనులు కూడా ఉన్నారు. అన్ని కులాలవారికి, స్త్రీలకు కూడా భగవత్సేవాధికారం కలిగించారు విఠలనాథుడు. 'అష్టఛాప్' కవులలో గుడ్డివాడైన సూరదాసు హిందీసాహిత్యాకాశంలోనే సూర్యుడి లాంటివాడు. శ్రీకృష్ణలీలలను వర్ణిస్తూ ఆయన వ్రాసిన కీర్తనలు వింటుంటే భక్తిపారవశ్యంతో శరీరం పులకరించిపోతుంది.

విఠలనాథుని తరువాత వారి కుమారులు ఏడుగురు సప్తాచార్యులుగా సప్తపీఠాలకు అధీశ్వరులై వాసికెక్కారు. ఈవారు



భారతదేశంలో పుష్టిమార్గప్రచారం చేస్తున్న ఆచార్య ప్రముఖులంతా వీరి సంతానమే. వీరు ఇప్పటికి తెలుగుదేశంనుండి వచ్చిన కన్య కలనే వివాహం చేసుకుంటారట.

శిక్షాశ్లోకోపదేశం:

తమ 52 వ ఏట వల్లభాచార్యులవారికి తాము అవతరించిన కార్యం నెరవేరినట్లనిపించింది. అప్పుడు వారు సన్న్యాసం స్వీకరించి 'పూర్ణానందుడ' నే పేరు ధరించారు. ఇహ పరమాత్మలో లీనమయి పోవాలని నిశ్చయించుకున్నాడు. త్రిదండ సన్న్యాస దీక్షతో, మౌనవ్రతం వహించి, కాలినడకన 18 రోజులునడిచి, ప్రయాగనుంచి కాశిలోని హనుమాన్ ఘట్టం చేరుకున్నారు. అక్కడ ఏడురోజులు కౌపీనంమాత్రం ధరించి ఉన్నారు. ఆషాఢ శుద్ధ విదియనాడు మధ్యాహ్నంవేళ గంగానదికి బయలుదేరారు. గంగాప్రవాహం మధ్య బొడ్డులోతు నీటిలో నిలబడ్డారు. అప్పుడు వారి తనయులు, శిష్యులు మాకు గతి ఏమిటని వాపోయారు. అప్పుడు వారు 'శిక్షాశ్లోకాలు' అనే పేరుతో ప్రసిద్ధి చెందిన ఈ అయిదు శ్లోకాలు చెప్పారు.

యదా బహిర్ముఖా యూయం భవిష్యథ కథంచన ।
తదా కాలప్రవాహస్థా దేహచిత్తాదయోఽప్యుత ॥

సర్వథా భక్షయిష్యంతి యుష్మానితి మతిర్మమ ।
న లౌకికః ప్రభుః కృష్ణో మనుతే నైవ లౌకికమ్ ॥ 2

భావ స్తత్రాప్యస్మదీయః సర్వస్వం చైహికశ్చ సః ।
పరలోకశ్చ తేనాయం సర్వభావేన సర్వథా ॥ 3

సేవ్యః స ఏవ గోపీశో విధాస్యత్యఖిలం హి నః
మయి చేద స్తి విశ్వాసః శ్రీగోపీజనవల్లభే ॥ 4

తదా కృతార్థా యూయం హి శోచనీయం న కర్హిచిత్ ।
ము క్తిర్హిత్వాన్యథారూపం స్వరూపేణ వ్యవస్థితిః ॥ 5

మీరు బహిర్ముఖులై అనగా లౌకికవ్యవహారాలలో పాల్గొనేట్లయితే, కాలప్రవాహంలో మునిగి కొట్టుకొనిపోయే మిమ్మల్ని దేహమూ-చి త్తమూ పూ ర్తిగా తినేస్తాయి. అంటే మీరు దేహానికి, చి త్తానికి లొంగిపోయి, ఇంద్రియాలకు దాసులై పోతారు. ప్రభువైన శ్రీకృష్ణుడు లౌకికుడు కాదు, మనస్సూ లౌకికం కాదు. సర్వభావంతో సర్వథా, సర్వస్వాన్ని, లోక, పరలోకాలను శ్రీకృష్ణునిపై భావించాలి. సర్వ ప్రపంచంలో గోపీశుడైన, గోపీజన వల్లభుడైన, శ్రీకృష్ణుడే సేవించదగినవాడని నా అభిప్రాయం, నా విశ్వాసం.

అలా చేసినట్లైతే మీకు పశ్చాత్తాపపడవలసిన అగత్యం కలగదు. ఇతర రూపాలను వదిలి స్వరూపంతో ఉండడమే ముక్తి.

**సూర్యప్రకాశంలో వల్లభుల ఐక్యం :**

ఇలా తనయులకు, శిష్యులకు చివరిసారిగా ఉపదేశించి, వారు సూర్యుణ్ణి తదేకంగా చూస్తూ నిలబడ్డారు. ఇంతలో ఉన్నట్లుండి సూర్యమండలం నుంచి ఒక ప్రకాశపుంజం క్రిందకు వచ్చింది. అక్కడ కూడి ఉన్న వారందరూ చూస్తుండగా శ్రీవల్లభాచార్యులవారు అందులో లీనమై పోయారు. పుష్టిమార్గ సంప్రదాయంలో ఈ సంఘటనను 'అసుర వ్యామోహం' అంటారు.

ఈ అద్భుత సంఘటనను ప్రత్యక్షంగా చూసినవారిలో విల్సన్ అనే పాశ్చాత్య దేశస్థుడున్నాడు. అతడు తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు, 'హిందువుల ప్రధాన తీర్థ స్థానమైన బెనారసులో గంగానది మధ్యలో మహాతేజస్వి అయిన శ్రీవల్లభుడనే హిందూసాధువు నీళ్ళలో నిలబడ్డాడు. ఇంతలో ఆకాశంనుంచి ఒక పెద్ద వెలుగు దిగివచ్చింది. ఆ సాధువు ఆ వెలుగులో లీనమై పోయారు. ఆ సమయంలో ఆకాశంనుంచి గంగవరకు ఒక ప్రకాశ

స్తంభంలా ఏర్పడింది. తరవాత కొంతసేపటి వరకు అక్కడ చేరినవారు దానిని చూస్తూ నిలబడి పోయారు. విజ్ఞానికి ఇది ఒక విచిత్రమైన అద్భుత సంఘటన.'

ఈ విషయం ఒక చిన్న పుస్తక రూపంలో ఇంగ్లీషు భాషలో ఇంగ్లాండులో అచ్చు అయింది.

అహంకారం అభిమానం అనర్థాలకు మూలం:

భగవంతుడైన శ్రీకృష్ణుడే పరబ్రహ్మ, పురుషోత్తముడనీ, అనన్యభావంతో అతణ్ణి సేవించడమే జీవులకు సర్వవిధాల కళ్యాణ ప్రదమనీ వల్లభాచార్యులవారు ఉపదేశించారు. వారు ప్రతిపాదించిన శుద్ధాద్వైత సంప్రదాయంలో, పుష్టిమార్గభక్తి విధానంలో శ్రీకృష్ణుని శరణుకోరి, సమస్తమూ అతడికి సమర్పించి, అతణ్ణి సేవించడమే భక్తుని ప్రధానలక్ష్యం. జీవుడు ప్రభువు అంశం. ఆ ప్రభువుకు దూరం కావడం చేత జీవుడు ఎన్నోకష్టాలకు, దుఃఖాలకు లోనవుతూ ఉంటాడు. కనుక సర్వదుఃఖనివృత్తికి శ్రీకృష్ణ శరణమే ఏకైకసాధనం. అహంకారం, అభిమానం ఈ రెండు అన్ని దోషాలకు మూలకారణం. అతి దీనభావంతో శ్రీకృష్ణుడే నాకు శరణ్యం, శ్రీకృష్ణుడే నాకు రక్షకుడు, శ్రీకృష్ణుడే నాకు ఆశ్రయం

అవి తలచుకుంటే, అహంకార-అభిమానాలకు తావులేకుండాపోతుంది. అందుచేతనే వల్లభాచార్యులవారు ఇలా అన్నారు-

యద్దైన్యం త్వత్కృపాహేతుర్న తదస్తి మమాణ్వపి।
తాం కృపాం కురు రాధేశ! యయా తే దైన్యమాప్నుయామ్॥

(హే రాధేశా! నీ కృపకు హేతుభూతమయినది దీనత్వమే. అది నాలో అణుమాత్రం కూడా లేదు. కనుక నాలో దీనత్వం కలిగేట్టు అనుగ్రహించు.)

**అపకారికి ఉపకారం:**

వల్లభాచార్యులవారు వైష్ణవులకు అంటే భక్తులందరికీ శ్రీకృష్ణుణ్ణి తప్ప ఇతరులను ఆశ్రయించవద్దనీ, భగవంతుడికి నివేదించకుండా ఏ వస్తువును స్వీకరించవద్దనీ, వ్యర్థంగా మాటలాడవద్దనీ, దుష్టుల సాంగత్యం చేయవద్దనీ ఉపదేశించారు. తలిదండ్రుల పట్ల వినయ విధేయతలతో మెలగాలనీ, జితేంద్రియులై ఉండాలనీ, గోవులను సేవించాలనీ, అపకారం చేసినవారికి ఉపకారందేస్తూ, సమస్త జీవులపట్ల దయకలిగి, ఔదార్యంతో ప్రవర్తించాలనీ ఉద్బోధించారు.

సరికొత్త నిర్వచనం:

శ్రీ కృష్ణుని సేవాకైంకర్యాలే మానవుడి ధర్మమనీ, శ్రీహరి లీలలను అనుభవించడమే అర్థమనీ, భగవద్దర్శనం లేదా భగవత్సాంగత్యం కోరుకోవడమే కామమనీ, సాయుజ్యమే మోక్షమనీ వల్లభాచార్యులవారు చతుర్విధ పురుషార్థాలను నిర్వచించారు.

ప్రసిద్ధగ్రంథాలు:

బ్రహ్మసూత్రాలకు 'అణుభాష్యం' 'తత్త్వార్థదీపిక' రచించి బ్రహ్మ సత్యమూ, జగత్తూ సత్యమేననీ, జీవుడు బ్రహ్మకు అంశమాత్రుడేనని నిరూపించారు వల్లభాచార్యులు. వారు రచించిన 84 గ్రంథాలలో బాలబోధ, సిద్ధాంతరహస్యం, వివేక ధైర్యాశ్రయ నిరూపణం, భక్తివర్ధిని, నిరోధలక్షణం మొదలయిన గ్రంథాలు సుప్రసిద్ధాలు.

ఇలా తమ జీవితమంతా భగవత్సేవకు అంకితం చేసి, మానవసేవయే సమస్త చరాచర ప్రపంచసేవయే మాధవసేవ అని ఆచరించి చూపిన వల్లభాచార్యులవారి జీవితం మనందరికి ఆదర్శం.

# శ్రీకృష్ణశరణాష్టకమ్

సర్వసాధనహీనస్య పరాధీనస్య సర్వతః ।
పాపపీనస్య దీనస్య శ్రీకృష్ణః శరణం మమ ॥ 1

సంసారసుఖసంప్రాప్తి సన్ముఖస్య విశేషతః ।
బహిర్ముఖస్య సతతం శ్రీకృష్ణః శరణం మమ ॥ 2

సదా విషయకామస్య దేహారామస్య సర్వదా ।
దుష్టస్వభావవామస్య శ్రీకృష్ణః శరణం మమ । 3

సంసారసర్పదష్టస్య ధర్మభ్రష్టస్య దుర్మతేః ।
లౌకికప్రాప్తికష్టస్య శ్రీకృష్ణః శరణం మమ ॥ 4

విస్మృత స్వీయధర్మస్య కర్మమోహితచేతసః ।
స్వరూపజ్ఞానశూన్యస్య శ్రీకృష్ణః శరణం మమ ॥ 5

సంసారసింధుమగ్నస్య భగ్నభావస్య దుష్కృతేః ।
దుర్భావలగ్నమనసః శ్రీకృష్ణః శరణం మమ ॥ 6

వివేక ధైర్య భక్త్యాదిరహితస్య నిరంతరమ్ ।
విరుద్ధకరణాసక్తేః శ్రీకృష్ణః శరణం మమ ॥ 7

విషయాక్రాంతదేహస్య వై ముఖ్యహృత సన్మతేః ।
ఇంద్రియాశ్వగృహీతస్య శ్రీకృష్ణః శరణం మమ ॥ 8

ఏతదష్టకపాఠేన హ్యేతదుక్తార్థభావనాత్ ।
నిజాచార్యపదాంభోజసేవకో౽ దైన్యమాప్నుయాత్ ॥ 9

ఇతి శ్రీహరిదాస విరచితం శ్రీకృష్ణశరణాష్టకం సంపూర్ణమ్.

## శ్రీ మ ధు రా ష్ట క మ్

అధరం మధురం వదనం మధురం నయనం మధురం
హసితం మధురమ్ ।
హృదయం మధురం గమనం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 1

వచనం మధురం చరితం మధురం వసనం మధురం
వలితం మధురమ్ ।
చలితం మధురం భ్రమితం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 2

వేణుర్మధురో రేణుర్మధురః పాణిర్మధురః పాదౌ మధురౌ ।
వృత్యం మధురం సఖ్యం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 3

గీతం మధురం పీతం మధురం భుక్తం మధురం
సుప్తం మధురమ్ ।
రూవం మధురం తిలకం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 4

కరణం మధురం తరణం మధురం హరణం మధురం
రమణం మధురమ్ ।
వమితం మధురం శమితం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 5

గుంజా మధురా మాలా మధురా యమునా మధురా
పీచిర్మధురా ।
సలిలం మధురం కమలం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 6

గోపీ మధురా లీలా మధురా యుక్తం మదురం భుక్తం
మధురమ్ ।
దృష్టం మధురం శిష్టం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 7
గోపీ మధురా గావో మధురా యష్టిర్మధురా
సృష్టిర్మధురా ।
దలితం మధురం ఫలితం మధురం మధురాధిపతే
రఖిలం మధురమ్ ॥ 8

ఇతి శ్రీమద్వల్లభాచార్యవిరచితం శ్రీమదురాష్టకం సంపూర్ణమ్.

## శ్రీ నందకుమారాష్టకమ్

సుందరగోపాలం ఉరవనమాలం నయనవిశాలం
దుఃఖహరమ్ ।
బృందావనచంద్రం ఆనందకందం పరమానందం
ధరణిధరమ్ ॥

వల్లభనువశ్యామం పూరణకామం అత్యభిరామం
ప్రీతికరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 1

సుందరవారిజవదనం నిర్జితమదనం ఆనందసదనం
ముకుటధరమ్ ।

గుంజాకృతిహారం విపినవిహారం పరమోదారం
చీరహరమ్ ॥

వల్లభపటపీతం కృతఉపవీతం కరనవనీతం
విబుధవరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 2

శోభితసుఖమూలం యమునాకూలం నిరూపశీలం
సుఖదవరమ్ ।

ముఖమండితరేణుం చారితధేనుం వాదితవేణుం
మధురసురమ్ ॥

వల్లభమతివిమలం శుభవదకమలం నఖరుచిఅమలం
తిమిరహరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 3

శిరముకుటసుదేశం కుంచితకేశం నటవరవేషం
కామపరమ్

మాయాకృతమనుజం హలధరఅనుజం ప్రతిహతదనుజం।
భారహరమ్ ॥

వల్లభవ్రజపాలం సుభగసుచేలం హితమనుకాలం
భావవరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 4

ఇందీవరభాసం ప్రకటసురాసం కుసుమవికాసం
వేణుధరమ్ ।

హితమన్మథమానం రూపనిధానం కృతకలగానం
చిత్తహరమ్ ॥

వల్లభమృదుహాసం కుంజనివాసం వివిధవిలాసం
కేలికరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 5

అతి పరమ ప్రవీణం పాలితదీనం భక్తాధీనం కర్మకరమ్ ।

మోహనమతిధీరం ఫణిబలవీరం హతపరవీరం
తరలతరమ్ ॥

వల్లభవ్రజరమణం వారిజవదనం జలధరశమనం
శైలధరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మపరమ్ ॥ 6

జలధరద్యుతి అంగం లలితత్రిభంగం బహుకృతిరంగం
రసికవరమ్ ।

గోకులపరివారం మదనాకారం కుంజవిహారం
గూఢనరమ్ ॥

వల్లభవ్రజచంద్రం సుభగసుచందం పరమానందం
భ్రాంతిహరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మవరమ్ ॥ 7

వందితయుగచరణం పావనకరణం జగదుద్ధరణం
విమలవరమ్ ।

కాలియశిరగమనం కృతఫణినమనం ఘాతితయవనం
మృదులతరమ్ ॥

వల్లభదుఃఖహరణం నిర్మలచరణం అశరణశరణం
ముక్తికరమ్ ।

భజ నందకుమారం సర్వసుఖసారం తత్త్వవిచారం
బ్రహ్మవరమ్ ॥ 8

ఇతి శ్రీమద్వల్లభాచార్యవిరచితం నందకుమారాష్టకం సంపూర్ణమ్

T.T.D. Religious Publication Series No. : 669
Price : Rs. 1/-

Published by Sri Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at
Sri Venugopala Offset Printers Ph : (0866) - 5511302.